క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



పెనమలూరు: వణుకూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు బండి పరిసియ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో మృతుడి కుటుంబానికి వైఎస్సార్ సీపీ గురువారం ఆర్థిక సాయం అందజేసింది. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఇవ్వగా పార్టీ నాయకుడు చక్కా గోపి ఆ నగదును గురువారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన బండి రాజ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతనికి కూడా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెనమలూరులో నిజాయతీ చాటిన ఏఎస్‌ఐ



పెనమలూరు: తనకు దొరికిన ఫోన్‌ను బాధితుడికి ఇచ్చి ఓ ఏఎస్‌ఐ నిజాయతీ చాటుకున్నాడు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పని చేస్తున్న మౌలాలి గురువారం డ్యూటీకి వస్తున్న సమయంలో సెల్‌ఫోన్ దొరికింది. ఫోన్‌లో నంబర్ల ఆధారంగా ఫోన్ యజమానిని గుర్తించారు. ఫోన్ యజమాని అయిన ఆటో డ్రైవర్ చిట్టిపోతుల నరేష్‌కు సమాచారం ఇచ్చి అతడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఫోన్ అందజేశారు. ఆటోడ్రైవర్ నరేష్ ఏఎస్‌ఐ మౌలాలికి కృతజ్ఞతలు తెలిపాడు.

పి.నైనవరంలో చలివేంద్రం ఏర్పాటు



పి.నైనవరం(విజయవాడరూరల్): జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు గురువారం పి.నైనవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గ్రామ ప్రజల సౌకర్యార్థం తాగునీటి సదుపాయం కల్పించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బట్టా సోమయ్య, స్థానికులు పాల్గొన్నారు.

బీసీ, ఓబీసీ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

ఉయ్యూరురూరల్: మండలంలోని బీసీ, ఓబీసీ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు ఉయ్యూరు ఎంపీడీవో జీవీఎస్ శేషగిరిరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా బీసీ, ఓబీసీ వర్గాలకు చెందిన 18 నుంచి 50 సంవత్సరాల లోపు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు. శిక్షణకు అభ్యర్థినుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆయా విభాగాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని వారు ఆధార్ కార్డుతో పాటు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలని దరఖాస్తును నేరుగా ఎంపీడీవో కార్యాలయంలో అందజేసి, ఆన్‌లైన్ చేయించుకోయించాలని సూచించారు.

గోశాలలో రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠ



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని చినకంచి గోశాలలో గురువారం రాధాకృష్ణుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు జొన్నవిత్తుల వెంకటరామశర్మ విగ్రహాలను ప్రతిష్ఠ చేశారు. రామకోటి దంపతులు రాధాకృష్ణుల విగ్రహాలను విరాళంగా అందజేశారని ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు. కృష్ణుడు చిన్నతనంలో గోవుల కాపారి కావడం వలన గోశాలల్లో కృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అదే విధంగా కృష్ణుడు రేపల్లెలో రాధాదేవితో కలిసి ఆడుతూ, పాడుతూ ఉంటాన్ని వారి ఇరువురి ప్రేమ తత్వం అలౌకికమైందన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై చిమ్మచీకట్లు



కామయ్యతోపు సెంటరులో వెలగని వీధి లైట్లు



తాడిగడప - పోరంకి నడుమ చీకట్లు

- ప్రధాన కూడళ్లలో అర్ధరాత్రి వరకే వీధి లైట్లు
- మిగిలిన చోట్ల వెలగని వీధి లైట్లు
- ప్రమాదకరంగా నేషనల్ హైవేపై ప్రయాణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కంకిపాడు: జాతీయ రహదారిపై చిమ్మచీకట్లు నెలకొంటున్నాయి. ప్రధాన కూడళ్లలో అర్ధరాత్రి వరకే వీధి లైట్లు వెలుగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో వీధిలైట్లు చూద్దామన్నా కనిపించని పరిస్థితి. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే క్రమంలో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా జాతీయ రహదారుల శాఖ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి.

వెలగని వీధి లైట్లు..

పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల మీదుగా విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి వెళ్తుంది. మార్గ మధ్యంలో కంకిపాడు, ఉయ్యూరు వద్ద బైపాస్ మార్గం కూడా నిర్మించారు. ప్రధాన గ్రామాలు, పట్టణాలకు నియోజకవర్గంలోని అనేక గ్రామాలు ప్రధాన కూడళ్లుగా ఉన్నాయి. అయితే ప్రధాన సెంటర్లలో మాత్రమే వీధి లైట్లు వెలుగుతున్నాయి. అవి కూడా అర్ధరాత్రి వరకే. అయితే చాలా చోట్ల వీధి లైట్లు ఉన్నా అవి వెలగటం లేదు. ప్రత్యేకించి బైపాస్ మార్గంలో చాలా ప్రాంతాల్లో ఏడాదికిపైగా వీధి లైట్లు వెలగని దుస్థితి. విజయవాడ పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, కార్మికులు రాత్రివేళ విధులు పూర్తి చేసుకుని గమ్యం చేరుకునే క్రమంలో వీధి లైట్లు వెలగక, చిమ్మ చీకటిలో ప్రయాణం సాగించలేక నరకం చూస్తున్నారు. భయం భయంగా రాకపోకలు సాగిస్తున్న దుస్థితి.

ప్రమాదాల బారిన వాహనదారులు..

కరకట్ట వెంబడి ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక భారీ వాహనాల్లో అర్ధరాత్రి వేళల్లో సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. లారీలు, ట్రాక్టర్ల నుంచి జారిపడ్డ ఇసుక రోడ్డు మార్జిన్‌లో పేరుకుపోయి మార్జిన్‌లు కనిపించక వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు. దీనికితోడు జాతీయ రహదారి వెంబడి ఉన్న అనేక హోటళ్లు, చిన్న చిన్న దాబాల్లో వచ్చే వ్యర్థాలతో కడుపు నింపుకోవటానికి కుక్కలు తిష్టవేసుకుని కూర్చుంటున్నాయి.

రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనదారులు వీటిని గుర్తించలేక, అవి గుంపులుగా సంచరిస్తూ ఎగబడటంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వాహనదారులు ప్రమాదాల నడుమ రాకపోకలు సాగిస్తుండటానికి కారణం హైవేపై వీధిలైట్లు వెలగకపోవటం కూడా ప్రధానంగా తెలుస్తోంది. వీధిలైట్ల నిర్వహణ, మరమ్మతులు విషయంలో జాతీయ రహదారుల శాఖ దృష్టి సారించి రాత్రి వేళ వెలుగులు నిండేలా చేస్తేనే ప్రయాణం సాఫీగా సాగుతుందని వాహనదారులు సూచిస్తున్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



పురుషోత్తపట్నంలో టీకా వేస్తున్న డాక్టర్ మేరీ వైడూర్యం

గన్నవరంరూరల్: పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి, వాటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ముస్తాబాద పశువైద్య చికిత్సా కేంద్రం డాక్టర్ మేరీ వైడూర్యం పశుపోషకులకు సూచించారు. మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గురువారం 250 పశువులకు గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు అందజేశారు. గాలికుంటు వ్యాధి వల్ల పశువులకు తీవ్ర జ్వరం, నీరసం, నోటి నుంచి తీగల మాదిరి చొంగ, నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు, రొప్పడం చూడి పశువులు ఈసుకుపోవడం జరుగుతుందన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వల్ల పాల ఉత్పత్తిని కాపాడుకోవచ్చని, దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదగడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. గాలికుంటు టీకా వేయించి, పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని, నివారణ టీకా ఒక్కటే మార్గమన్నారు. రైతుల ఆర్థిక ప్రగతికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.

12 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తున్న ఈఓ హేమలతాదేవి తదితరులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వార్ల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని దేవస్థానం కార్యానిర్వహణాధికారి ఎస్.హేమలతాదేవి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని దేవస్థానం వద్ద గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్, దేవస్థానం సిబ్బందితో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీన ఉదయం గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచన, పంచగవ్య ప్రాసన, రక్షాబంధన, పూజా కార్యక్రమాలు, సాయంత్రం ధ్వజారోహణం జరుగుతుందన్నారు. 13న ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకం, సాయంత్రం చెరువు సెంటర్‌లో రాయబారం, రాత్రి కళ్యాణ మహోత్సవం, 14న రథోత్సవం, నిత్యార్చన, విశేష హోమాలు, పూర్ణాహుతి, వసంతోత్సవం, ధ్వజావరోహణం నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉత్సాహంగా సావిష్కార్ - 2కే25



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధ్యాపకులు

రామవరప్పాడు(విజయవాడ రూరల్): విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రిన్సిపల్ కన్సల్టెంట్ ఐటీ, అహల్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ మకుటప్ పిలుపునిచ్చారు. ఎనికేపాడులోని విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో గురువారం 'సావిష్కార్ -2కే25' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రోజురోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు అభివృద్ధి సాధించాలని సూచించారు.

దేశం గర్వించే స్థాయికి ఎదగాలి..

యూత్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ సీఈఓ ఉప్పలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. టెక్ ఫెస్ట్ అనేది విద్యార్థుల్లో టాలెంట్‌ను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తాము కళాశాలలో ప్రతి ఏటా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఎస్ఆర్కే ఫౌండేషన్ సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుని దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పేపర్ ప్రజెంటేషన్, కోడ్ వార్, సృజన, క్విజ్, బగ్ హంటర్, మార్కెట్ మేకర్స్, కేస్ స్టడీ తదితర విభాగాల్లో తమ సృజనాత్మకతను చాటారు. కార్యక్రమంలో వై.విజయ, సుబ్బయ్య, డాక్టర్ వి.రాఘవలక్ష్మి తదితరులు పాల్గొని మాట్లాడారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



ధనేకుల కాలేజీలో డ్రోన్‌లను పరిశీలిస్తున్న మధుమూర్తి తదితరులు

పెనమలూరు: విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోని లక్ష్యాన్ని చేరుకోవాలని ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం జాతీయ స్థాయి శాస్త్ర, సాంకేతిక, సంస్కృతిక సమ్మేళనం ధనుష్ 2కే25ను గురువారం ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు సృజనాత్మకతతో వ్యవహరించి నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. నేడు టెక్నాలజీ వేగంగా మారుతుందని, విద్యార్థులు కూడా మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పరిశోధనలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

80 కాలేజీలు.. 7,200 మంది విద్యార్థులు

ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు పరిశీలించారు. కాలేజీలో ఉన్న డ్రోన్ ల్యాబ్, ఏఐ సెంటర్, 3డీ ప్రింట్, పీసీబీ డిజైన్ మిషన్, ఏఐ రోబోస్ ల్యాబ్ పరిశీలించి ప్రశంసించారు. ధనుష్‌లో మొత్తం 80 కాలేజీల నుంచి 7,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, డైరెక్టర్ రవిప్రసాద్, సెక్రటరీ భవానీప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తపస్సు కాలం దీక్షలు ప్రారంభం



తపస్సు కాలం దీక్షలు స్వీకరించిన భక్తులు

పెనమలూరు: కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో 45 రోజుల తపస్సు కాలం దీక్షలు బుధవారం రాత్రి ప్రారంభించారు. కానూరు, కామయ్యతోపు, పోరంకి, గంగూరు, వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 150 మందికి పైగా భక్తులు దీక్షలు స్వీకరించారు. ఫాదర్, విచారణ గురువు సలివేంద్రశౌరి జపమాలలు ఆశీర్వదించి, దీక్షాదారుల మెడలో వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫాదర్ సలివేంద్రశౌరి మాట్లాడుతూ.. ఉపవాస ప్రార్థనలతో పాపం అనే చీకటిని జయించి క్రీస్తు పునరుత్థాన మహిమలో పాలుపంచుకోవాలన్నారు. పూజా కార్యక్రమంలో మేత్రిదేవదానం, ఫాదర్ రత్నరాజు పాల్గొని భక్తులకు విభూది, జపమాలలు అందజేశారు. కార్యక్రమంలో సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, యూనిట్ లీడర్స్, దళ సభ్యులు పాల్గొన్నారు.

వేలేరులో ఇంకుడు గుంతల తవ్వకంపై వివాదం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జగనన్న కాలనీలో ఇంకుడు గుంతల తవ్వకాలు వివాదానికి దారి తీసింది. కాలనీలోని గృహ ఆవరణల్లో ఇంకుడు గుంతల తవ్వకాలు చేస్తున్న అధికారులకు గతంలో అడ్డుకోగా, మరోమారు గురువారం పంచాయతీ అధికారులు రంగంలోని దిగారు. కాలనీకి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైనుపై ఇంకుడు గుంతలు తవ్వి సిమెంటు వరలు వేయటంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఇంకుడు గుంతల నుంచి మురికి నీరు, తాగునీటి పైపుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 8వ తేదీ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వావిలాల రజనీకాంత్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహించే శిబిరంలో ఆయాన్ ఐ ఆస్పత్రికి వైద్యులు ఉచితంగా నేత్ర పరీక్షలు చేస్తారని తెలిపారు. శుక్లాలు ఉన్నవారికి అవసరమైన మేరకు రాయితీపై శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన టెక్నాలజీతో వేగంగా ఔషధ పరిశోధనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అభివృద్ధి చెందిన దేశాల్లో ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి నూతన ఔషధ పరిశోధనలు వేగవంతంగా పూర్తిచేస్తున్నట్లు అమెరికాలో క్యాన్సర్‌పై పరిశోధనలు చేస్తూ బిజినెస్ డెవలప్‌మెంట్ లీడర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ సబ్బినేని హారిక అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మా అన్వేషణ్-2025 పేరుతో సదస్సు నిర్వహించారు.

ముఖ్యఅతిథి హారిక మాట్లాడుతూ నూతన టెక్నాలజీని పరిశోధనలో ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో సమర్థంగా నిర్వహించవచ్చన్నారు. ఏఐ టెక్నాలజీపై అవగాహన కలిగిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిశోధనల్లో ఏఐని ఉపయోగించి త్వరితగతిన పూర్తి చేస్తున్న క్రమాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సునీత, డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు.. ఇక ఫట్!

కోర్టు ఆదేశించినా చర్యలు శూన్యం

- ఎన్నికల కోడ్ ముగిసినా వేలం నిర్వహణలో జాప్యం
- భూముల్లో అక్రమంగా సాగు చేస్తున్న పచ్చనేతలు
- తాజాగా ఏపీఐఐసీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం పావులు



తాడిగడప వక్ఫ్ భూమిలో అక్రమంగా సాగు జరుగుతున్న వరి పంట

పెనమలూరు: అత్యంత విలువైన వక్ఫ్ భూములు పచ్చనేతల కబంద హస్తాల్లో చిక్కుకున్నాయి. భూములకు కౌలు వేలం నిర్వహించాలని హైకోర్టు ఆదేశించినా.. నేటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. తాజాగా వక్ఫ్ భూములు ఏపీఐఐసీకి కట్టపెట్టడానికి ప్రభుత్వం సైతం కన్నేయటంతో అత్యంత విలువైన వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయిపోతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇదీ విషయం..

కొండపల్లి ఖాజీ సర్వీసుకు చెందిన వక్ఫ్ భూములు తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో ఉన్నాయి. తాడిగడపలో ఆర్ఎస్ నంబర్ 79,173,179లలో 30.04 ఎకరాలు, పెదపులిపాకలో ఆర్ఎస్ నంబర్ 87లో 12.82ఎకరాల భూమి ఉంది. బహిరంగ మార్కెట్‌లో వీటి ధర రూ. 350 కోట్లకు పైగా పలుకుతుంది. గత కొద్ది సంవత్సరాలుగా ఒక వ్యక్తి చేతిలో ఈ భూములు ఉండటంతో 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురించింది. దీంతో వక్ఫ్ అధికారుల్లో కదలిక వచ్చింది. వక్ఫ్ భూములు సాగు కౌలు వేలం నిర్వహించటానికి జిల్లా అధికారుల దృష్టికి జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆడిట్ వక్ఫ్ తీసుకువెళ్లారు.

వేలంనకు ఆదేశాలు..

కాగా వక్ఫ్ భూములకు వేలంపాట నిర్వహించటానికి మండల తహసీల్దార్ నోటీసులు ఇచ్చారు. జనవరి 31వ తేదీన వేలంపాట నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ లోగా భూముల్లో ఉన్న వ్యక్తి వేలంపాట ఆపటానికి హైకోర్టును ఆశ్రయించగా కోర్టు సైతం వేలంపాట నిర్వహించాలని ఆదేశించింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సాకుతో అధికారులు వేలం వాయిదా వేశారు. తెరవెనుక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వేలం వాయిదా పడిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

వక్ఫ్ భూముల్లో అక్రమంగా సాగు..

కాగా కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా పచ్చ నేతలు కొందరు వక్ఫ్ భూముల్లోకి ప్రవేశించి అక్రమ సాగు చేపట్టారు. దీనిపై జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్ రాత పూర్వకంగా రెవెన్యూ అధికారులకు, పెనమలూరు పోలీసులకు 15 మందిపై జనవరి 25వ తేదీన ఫిర్యాదు చేశారు. అయితే జిల్లా అధికారులు కాని, పోలీసులు కాని ఎటువంటి క్రిమినల్ చర్యలు తీసుకోలేదు. హైకోర్టు ఆదేశాలు కాని, ఎన్నికల కోడ్ కాని ఆక్రమణదారులను అడ్డు రాలేదు. వక్ఫ్ భూముల్లో ఆక్రమణదారులు చట్ట విరుద్ధంగా సాగు చేస్తున్నారు. నేటికీ ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోకపోవటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారిందని ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసినా వేలంపాటకు చర్యలు ఏవని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


తెరపైకి ఏపీఐఐసీ..

పచ్చనేతలతో పాటు, ప్రభుత్వం కూడా వక్ఫ్ భూములపై కన్నేసినట్లు తెలుస్తోంది. కోర్టు ఆదేశాల మేరకు పంటసాగు పై వేలంపాట వేయాల్సి ఉండగా నేటికీ అది జరగలేదు. పైగా అత్యంత విలువైన వక్ఫ్ భూములను దీర్ఘకాలం లీజుపై ఏపీఐఐసీకి ధారాదత్తం చేయటానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఒక పక్క పచ్చగద్దలు వక్ఫ్ భూమిలో అక్రమంగా సాగు చేస్తుంటే, మరో పక్క ఏపీఐఐసీ పేరుతో విలువైన వక్ఫ్ భూములకు ఎసరుపెట్టే పనిలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

కోర్టు ఆదేశాలు వెంటనే అమలు చేయాలి

వక్ఫ్ భూములకు బహిరంగ కౌలు వేంపాట నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు వెంటనే అమలు చేయాలని ముస్లిం మైనారిటీ నేతలు కోరుతున్నారు. అలాగే ఏపీఐఐసీకి వక్ఫ్ భూములు ఇవ్వాలని వచ్చిన ప్రతిపాదన సరైంది కాదని ఖండిస్తున్నారు. వక్ఫ్ భూములు పూర్తిగా వక్ఫ్ ఆధీనంలో ఉండాలని, భూములపై వచ్చే ఆదాయం కేవలం ముస్లిం మైనారిటీల సంక్షేమానికే ఉపయోగించాలని కోరుతున్నారు. వక్ఫ్ భూములపై వచ్చే ఆదాయంతో వక్ఫ్ బోర్డు ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచిస్తున్నారు. వక్ఫ్ అధికారులు భూములు ఆక్రమించిన వారిపై కోర్టు ధిక్కార కేసు వేయాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వక్ఫ్ భూములకు కౌలు వేలంపాట నిర్వహించి పచ్చనేతల నుంచి భూములు కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. అత్యంత విలువైన వక్ఫ్ భూముల పరిస్థితి నేడు ప్రశ్నార్థకంగా మారింది.

ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాల పరిశీలన



నున్నలో కట్టడాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ చైతన్య, తహసీల్దార్ సుగుణ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ఆర్ఎస్ నంబరు 151/2 ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ బి.సుగుణ గురువారం పరిశీలించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం డొంక పోరంబాకు ప్రభుత్వ భూమిగా ఉందని, గత కొన్ని నెలలుగా ఆ భూమిలో గృహాలు నిర్మించి విక్రయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూమికి సంబంధించి కోర్టులో స్టేటస్‌కో ఉందని తహసీల్దార్ చెప్పారు.

9న వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం

ఉంగుటూరు: మానికొండ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతీ ఆండాల్ సహిత వెంకటేశ్వరస్వామి వారి 25వ వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, తులసీ దళాలతో స్వామి వారికి అర్చన నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు శాంతి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతాయని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు గ్రామ వీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

విద్యార్థులకు సాయం అందించిన దాతలకు సత్కారం



దాతను సత్కరిస్తున్న పాలడుగు లక్ష్మణరావు తదితరులు

పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించిన దాతలను ఘనంగా సత్కరించారు. కానూరు కాలేజీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు వివరాలు తెలుపుతూ.. గత ఆరేళ్లలో కాలేజీలో చదివిన 2,004 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహం కింద పలు సంస్థలు, దాతలు ముందుకు వచ్చి రూ.4.60 కోట్లు సాయం అందించారన్నారు. ఈ సందర్భంగా నార్త్ సౌత్ ఫౌండేషన్ ప్రతినిధులు సూరపనేని వెంకటరత్నం, ఎం.శ్రీలత, మాంటిస్సోరి పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి వి.రంగప్రసాద్, తెలుగు పీపుల్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ ప్రతినిధులు వి.రామకృష్ణ, బీహెచ్.రామ్, బి.లవకుశ, కోనేరు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు కె.భీమేశ్వరరావు, కె.నరేంద్రబాబు, వైవీ చారిటబుల్ ట్రస్టు కె.రవిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనకు ఎంతగానో కృషి చేస్తున్నామని తెలిపారు. దీనికి దాతలు ముందుకు వచ్చి విద్యార్థులను ప్రోత్సహించి వారికి ఆర్థికంగా సాయం అందించటం ఎంతో మేలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కాలేజీ కన్వీనర్ వి.నాగభూషణరావు, హెచ్‌ఓడీ శ్రీలక్ష్మి, కోఆర్డినేటర్లు ఉషారాణి, తులసి, శ్రీ విజయ, దేవికారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

● **పెనమలూరు:** తాడిగడపలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. కానూరు శ్రీరామ్‌నగర్ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తాడిగడప పరిధిలో వసంతనగర్, శ్రీనివాసానగర్ కాలువ కట్టలు, లిబ్రా కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.